గురువారం 18-4-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 309, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD



మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616

email: mundadugu111@gmail.com


## నేటి నుంచి తెలుగు రాష్ట్రాల్లో నామినేషన్ ప్రక్రియ

### ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు



**ముందడుగు జాతీయం:**

తెలంగాణలో లోక్‌సభ, ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన కీలక ఘట్టం నేడు (ఏప్రిల్ 18) ప్రారంభం కానుంది. దేశంలో మొత్తం ఏడు దశలలో లోక్‌సభ ఎన్నికలు జరగనుండగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో నాలుగో దశలో ఎన్నికలు జరపనున్నట్టుగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన సంగతి తెలిసిందే. తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలతో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికకు.. ఆంధ్రప్రదేశ్‌లో 25 లోక్‌సభ స్థానాలతో పాటు రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించనున్నారు.

గురువారం (ఏప్రిల్ 18) ఉదయం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడంతో నామినేషన్లు దాఖలు చేసే ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఎన్నికల్లో పోటీ చేయాలని భావించే వారు ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు.. అవి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది. ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన చేపట్టనుండగా.. ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. ఆ తర్వాత ఎన్నికల అధికారులు ఆయా స్థానాల్లో బరిలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితాను వెల్లడిస్తారు. ఇక, మే 13న పోలింగ్ జరగనుండగా.. పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు అంటే మే 11 సాయంత్రం 6 గంటలతో ఎన్నికల ప్రచారం ముగియనుంది. ఇక, జూన్ 4 వ తేదీన ఎన్నికల ఫలితాలను వెల్లడికానున్నాయి.




## పేదరికం వ్యాఖ్యలపై రాహుల్ వివరణ

- దారిద్ర్యం తొలగిపోతుందని ఎవరూ చెప్పలేదు
- తనపై వచ్చిన విమర్శలకు రాహుల్ స్పష్టత

వివరాలు 2లో

## బాలరాముడి నుదిటిపై సూర్య తిలకం

- పరవశించిపోయిన శ్రీరామ భక్తజనం
- అధునాతన సాంకేతికత సాయంతో సూర్యకిరణాలు
- ప్రతి శ్రీరామ నవమి రోజు తిలకం దిద్దేలా ఏర్పాట్లు



**ముందడుగు అయోధ్య:**

అయోధ్య ఆలయంలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగిన తర్వాత తొలి శ్రీరామ నవమి కావడంతో ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. స్వామి దర్శనం కోసం దేశవిదేశాల నుంచి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. బాలరాముడి నుదిటిపై కన్పించిన 'సూర్య తిలకం'తో భక్తజనం పరవశించిపోయింది. అధునాతన సాంకేతికత సాయంతో సూర్యకిరణాలు గర్భగుడిలోని రాముడి విగ్రహం నుదుటిపై తిలకం వలే 58 మిల్లీమీటర్ల పరిమాణంలో కొన్ని నిమిషాల పాటు ప్రసరించాయి. మూడో అంతస్తు నుంచి గర్భగుడిలోని బాలరాముడి విగ్రహం నుదుటిపై సూర్యకిరణాలు ప్రసరించేలా అయోధ్య ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరిమిత సంఖ్యలో పైపులు, కుంభాకార, పుటాకార మిగతా 2లో

## దేశంలో తొలి దశ పోలింగ్‌కు సిద్ధం

- ఏప్రిల్ 19న మొదటి విడత పోలింగ్
- తొలి విడతలో 8 మంది కేంద్ర మంత్రులు..
- మొదటి దశలో 102 లోక్‌సభ స్థానాలు

**ముందడుగు జాతీయం:**

దేశంలో మొదటి విడత సార్వత్రిక ఎన్నికల సమరానికి సర్వం సిద్ధమైంది. దేశవ్యాప్తంగా 543 లోక్‌సభ స్థానాలకు ఏడు విడతల్లో పోలింగ్ జరగనుండగా తొలి దశ పోలింగ్‌కు సంబంధించి ప్రచారానికి నేటితో తెర పడింది. రాజకీయ పార్టీల ప్రచారంతో మార్మోగిన మైకులు.. బుధవారం సాయంత్రం ఐదు గంటలకు మూగబోయాయి. మొత్తం 21 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో కలిపి 102 లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 19న మొదటి విడత పోలింగ్ జరగనుంది.

తమిళనాడులో మొత్తం 39 స్థానాలు ఉండగా అక్కడ ఒకేరోజు పోలింగ్ జరగనుంది. రాజస్థాన్ 12, ఉత్తర్‌ప్రదేశ్ 8, మధ్యప్రదేశ్ 6, మహారాష్ట్ర, అస్సాం, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో అయిదు చొప్పున, బిహార్‌లో నాలుగు, పశ్చిమ బెంగాల్‌లో మూడు, అరుణాచల్ ప్రదేశ్, మణిపుర్, మేఘాలయాల్లో రెండు చొప్పున, ఛత్తీస్‌గఢ్, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అండమాన్ నికోబార్, జమ్మూ కశ్మీర్, లక్షద్వీప్, పుదుచ్చేరిలలో ఒక్కో లోక్‌సభ స్థానానికి ఏప్రిల్ 19న పోలింగ్ జరగనుంది.



### తొలి పోరులో 8 మంది కేంద్ర మంత్రులు..

తొలిదశ పోలింగ్‌లో భాగంగా మొత్తం ఎనిమిది మంది మంత్రులు, ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు, ఓ మాజీ గవర్నర్ పోటీలో ఉన్నారు. నాగ్‌పుర్ స్థానం నుంచి బరిలో ఉన్న కేంద్ర రోడ్డు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ.. హ్యాట్రిక్ కొట్టాలని చూస్తున్నారు. అరుణాచల్ వెస్ట్ నుంచి కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు పోటీలో ఉన్నారు. 2004 నుంచి వరుసగా మూడుసార్లు గెలుపొందారు. తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్.. చెన్నై సౌత్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు.



## మోడీ గెలిస్తే దేశంలో ప్రజాస్వామ్యం ఉండదు

- మోడీ గెలిస్తే దేశంలో ప్రజాస్వామ్యం ఉండదు
- తాము అధికారంలోకి వస్తే సీఏఏను రద్దు చేస్తాం
- బెంగాల్ సీఎం మమతా బెనర్జీ హామీ

వివరాలు 2లో

ముందడుగు
గురువారం
18-4-2024
హైదరాబాద్

# తెలంగాణలో మండుతున్న ఎండలు

## పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ

**ముందడుగు తెలంగాణ:**



తెలంగాణ రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. భానుడి భగభగలకు ప్రజలు అల్లలాడుతున్నారు. దానికి తోడు తెలంగాణలో రాగల 3 రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. బుధ, గురు, శుక్రవారాల్లో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపింది. బుధవారం మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో, గురువారం... కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో వడగాల్పులు వీస్తాయని వెల్లడించింది. ఈ జిల్లాలకు వాతావరణ శాఖ మూడు రోజుల పాటు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ద్రోణి.. దక్షిణ విదర్భ నుంచి మరట్వాడ, ఉత్తర అంతర్గత కర్ణాటక నుంచి దక్షిణ అంతర్గత కర్ణాటక వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి. మీ ఎత్తులో కొనసాగుతోందని తెలిపింది. మరో ద్రోణి.. మన్నార్ గల్ఫ్ నుంచి అంతర్గత తమిళనాడు, రాయలసీమ మీదుగా దక్షిణ తెలంగాణ వరకు సగటు సముద్ర మట్టానికి 1.5 కి. మీ ఎత్తులో కొనసాగుతోందని పేర్కొంది. వీటి ప్రభావంతో బుధ, గురు, శుక్రవారాల్లో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

# బాలరాముడి నుదిటిపై సూర్య తిలకం

మొదటిపేజీ తరువాయి

కటకాలతో ఒక వ్యవస్థను రూపొందించారు.
ఆలయ శిఖర భాగంలో సూర్యకాంతి గ్రహించేందుకు ఒక పరికరాన్ని ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి పైపులోపలికి కాంతి ప్రసరించి తిలకంగా కన్పించింది. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్(ఐఐఏ) శాస్త్రవేత్తలు, పరిశోధకుల సాయంతో కేంద్ర భవన నిర్మాణ పరిశోధన సంస్థ(సీబీఆర్ఐ) శాస్త్రవేత్తలు ఆలయాన్ని ప్రత్యేకంగా నిర్మించారు. ప్రతి శ్రీరామ నవమి రోజున శ్రీరాముడి విగ్రహంపై ఈ తిలకం దిద్దేలా ఏర్పాట్లు చేశారు. ఈ వ్యవస్థ 19 ఏళ్లు నిరాటంకంగా పనిచేస్తుంది. ఆ తర్వాత మరోసారి సమయాన్ని సరిచేయాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

# 'పేదరికం' వ్యాఖ్యలపై రాహుల్ వివరణ

**ముందడుగు ఢిల్లీ:**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తాను చేసిన 'పేదరికం' వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. ప్రధాని మోడీ విమర్శలు చేయడంతో రాహుల్ నుంచి స్పందన వచ్చింది. ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో రాహుల్ మాట్లాడుతూ ''కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారి ఖాతాల్లో ప్రతీ ఏటా రూ.లక్ష వస్తూనే ఉంటుంది. చిటికెలో భారత్ నుంచి పేదరికాన్ని తొలగిస్తాం'' అని వ్యాఖ్యలు చేశారు. దీనిపై మోడీ చెణుకులు విసిరారు. ''ఒక్క వేటుతో పేదరికాన్ని మాయం చేసే రాజ మాంత్రికుడు'' అంటూ అభివర్ణించారు. ''ఇన్నేళ్లుగా ఈ రాకుమారుడు ఎక్కడ ఉన్నారు? ఆయన నాన్నమ్మ (ఇందిరా గాంధీ) 50 ఏళ్ల క్రితమే గరీబీ హటావో నినాదం ఇచ్చిన విషయం ప్రజలకు తెలుసు'' అంటూ రాహుల్ పేరు ప్రస్తావించకుండానే చురకలు వేశారు. ఈ క్రమంలో రాహుల్ నుంచి స్పందన వచ్చింది. ''ఒకే దెబ్బకు దారిద్ర్యం తొలగిపోతుందని ఎవరూ చెప్పలేదు. కానీ అధికారంలోకి వస్తే మేము ఆ దిశగా మెరుగైన చర్యలు తీసుకోగలం'' అంటూ తనపై వచ్చిన విమర్శలకు స్పష్టత ఇచ్చారు.



# కేరళ లోక్‌సభ ప్రచారానికి రేవంత్ రెడ్డి

## అభ్యర్థులకు మద్దతుగా రెండు రోజులు ప్రచారం

**ముందడుగు తెలంగాణ:**

కేరళలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ముఖ్యమంత్రి, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. రెండు రోజుల పాటు కేరళలో రేవంత్ రెడ్డి ప్రచారం చేయనున్నారు. అక్కడ కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారంలో పాల్గొననున్నారు. దేశంలో మొత్తం ఏడు దశలలో లోక్‌సభ ఎన్నికలు జరుగుతుండగా.. అవసరాన్ని బట్టి వివిధ ప్రాంతాల్లో పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ముఖ్య నాయకులు ప్రచారంలో పాల్గొనేలా కాంగ్రెస్ పార్టీ ప్రణాళికలు రూపొందిస్తుంది. కేరళలో మొత్తం 20 లోక్‌సభ స్థానాలకు రెండో దశలో భాగంగా ఏప్రిల్ 26వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా కేరళలోని వయనాడు నుంచి పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. కేరళలో పోలింగ్ తేదీ సమీపిస్తున్న తరుణంలో ఇతర రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ ముఖ్యనేతలు కూడా అక్కడ పర్యటించి.. పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈ క్రమంలోనే టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కూడా రెండు రోజుల పాటు కేరళలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహిస్తారు. ఇందుకోసం రేవంత్ రెడ్డి బుధవారం కేరళ బయలుదేరి వెళ్లారు. రాహుల్ గాంధీ పోటీ చేస్తున్న వయనాడులో రేవంత్ రెడ్డి ఈరోజు ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. రాహుల్ గాంధీకి మద్దతుగా ప్రజల నుంచి ఓట్లు కోరనున్నారు. గురువారం కూడా కేరళలో ఒకరిద్దరు కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. గురువారం రాత్రి రేవంత్ రెడ్డి తిరిగి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.



# నిరాశ్రయుల మధ్యలో శ్రీరామ నవమి వేడుకలు

**ముందడుగు హైదరాబాద్:**

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొనలేని అనాథలు అభాగ్యులకు పానకం, అరటి పండ్లు అందించారు. పండుగ జరుపుకోలేని వారికి పానకం అందించారు. పానకాన్ని సేవించిన ప్రతి ఒక్కరూ రాములవారి కళ్యాణం పండుగ జరుపుకోలేకపోయామే అనే బాధను తొలగించారు అని స్కై ఫౌండేషన్ కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పావని.ఓ తదితరులు పాల్గొన్నారు.

# మోడీ గెలిస్తే దేశంలో ప్రజాస్వామ్యం ఉండదు

**ముందడుగు పశ్చిమ బెంగాల్:**

విపక్ష కూటమి 'ఇండియా' కేంద్రంలో అధికారంలోకి వస్తే సీఏఏ, ఎన్ఆర్సీలను రద్దు చేస్తామని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ హామీ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆమె అస్సాంలో తమ పార్టీ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా దీదీ మాట్లాడుతూ.. మూడోసారి గనక ప్రధాని నరేంద్రమోడీ అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యం ఉండదు. ఎన్నికలూ ఉండవని వ్యాఖ్యానించారు. దేశాన్ని వాళ్లు నిర్బంధ శిబిరంలా మార్చేశారని.. ఇంత ప్రమాదకరమైన ఎన్నికలను తన జీవితంలో ఎన్నడూ చూడలేదన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే.. నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్, పౌరసత్వ సవరణ చట్టం, ఉమ్మడి పౌరస్మృతి ఉండవన్నారు. వివక్షతో ఉన్న అన్ని చట్టాలను రద్దు చేస్తామని స్పష్టంచేశారు.

# ప్రేమ వైఫల్యం కారణంగా ప్రేమికుడు ఆత్మహత్య

- అందుకు ప్రియురాలిని బాధ్యులం చేయలేం
- ఢిల్లీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**ముందడుగు ఢిల్లీ:**

ప్రేమ వైఫల్యం కారణంగా ప్రేమికుడు ఆత్మహత్య చేసుకుంటే దానికి మహిళను బాధ్యులు చేయలేమని ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించింది. ఆత్మహత్యకు ప్రేరేపించారనే కేసులో ఇద్దరు వ్యక్తుల ముందస్తు అరెస్ట్ నుంచి బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఈ విధంగా వ్యాఖ్యానించింది. బలహీనమైన మనస్తత్వం ఉన్న వ్యక్తి తీసుకున్న నిర్ణయానికి మరో వ్యక్తిని నిందించలేము'' అని కోర్టు పేర్కొంది. ప్రేమ వైఫల్యం కారణంగా ప్రేమికుడు ఆత్మహత్యకు పాల్పడితే, పరీక్షలో ఫెయిల్ అయిన కారణంగా విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడితే, ఒక కేసు గెలిపించలేదని క్లయింట్ ఆత్మహత్యకు పాల్పడితే ఆ మహిళను, ఎగ్జామినర్‌ని, లాయర్‌ని ఆత్మహత్యకు సహకరించారని భావించలేము అని జస్టిస్ అమిత్ మహాజన్ అన్నారు. 2023లో వ్యక్తిని ఆత్మహత్యకు ప్రేరేపించారనే ఆరోపణపై ప్రాసిక్యూషన్ ఎదుర్కొంటున్న ఒక మహిళ, ఆమె స్నేహితుడికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ అమిత్ మహాజన్‌తో కూడిన సింగిల్ జడ్జి ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

ముందడుగు
గురువారం
18-4-2024
హైదరాబాద్



# అడవి జంతువుల దాహం తీర్చుతున్నారు

- బిందెలతో అడవికి నీరు తీసుకెళ్తున్నారు
- గ్రామస్తులు వినూత్న ప్రకృతి సేవకు ప్రశంసలు

**ముందడుగు కర్ణాటక:**

మండే ఎండలకు ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో నీటి సమస్య ఏర్పడుతున్నాయి. మనుషులకే నీరు దొరకక ఇబ్బంది పడుతుంటే నీరులేక జంతువులు మృత్యువాత పడుతున్నాయి. దీంతో కర్ణాకటలోని దావణగెరె జిల్లా చన్నగిరి తాలూకా జోడాలాల్, హనమంత్‌పూర్ గ్రామస్తులు వినూత్న ప్రకృతి సేవ చేస్తున్నారు. వీరు చేస్తున్న పనితో అందరి ప్రశంసలను అందుకుంటున్నారు.

జోడల్, హనమంత్‌పూర్ గ్రామస్థులు తమ ఇళ్ల నుంచి మూగజీవులు, వన్య ప్రాణులకు తాగేందుకు నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ రెండు గ్రామాలకు చెందిన కొంతమంది బిందెల్లో నీటిని నింపుకుని అడవిలోకి వెళ్లి జంతువుల దాహార్తిని తీరుస్తున్నారు. జోలదాల్, హనుమంతనగర్ గ్రామాన్ని ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతంలోకి వెళ్లి గ్రామస్తులు తాము తీసుకెళ్లిన నీటిని జంతువులు తాగే నీటి గుంతలో వేశారు. అయితే ఓ వైపు అనేక గ్రామాల్లో నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గుక్కెడు నీరు తాగడానికి లేక తాము అల్లాడుతుంటే.. వన్యప్రాణులకు నీటి సరఫరా చేయడంపై రెండు గ్రామాల గ్రామస్తులపై సమీపంలోని కొన్ని గ్రామాలకు చెందిన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# బ్యాటరీ ఎలక్ట్రిక్ రంగంలోకి డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్




**ముందడుగు హైదరాబాద్:**

డైమ్లెర్ ట్రక్ ఎజి ("డైమ్లర్ ట్రక్") యొక్క సంపూర్ణయాజమాన్య అనుబంధ సంస్థ అయిన డైమ్లెర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ (డిఐసివి) ఆల్‌ఎలక్ట్రిక్, నెక్స్ట్ జనరేషన్ 'ఇక్యాంటర్' తో భారతీయ బ్యాటరీ ఎలక్ట్రిక్ మార్కెట్లోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. డైమ్లెర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ & సీఈఓ శ్రీ సత్యకాం ఆర్య మాట్లాడుతూ, "దీర్ఘకాలికంగా సీఓటూన్యూట్రల్ ప్రొపల్షన్ టెక్నాలజీలను కలిగి ఉండే మా భవిష్యత్ ఉత్పత్తుల కోసం దృఢమైన సంసిద్ధతను సాధించేందుకు మా ప్రయత్నాలన్నీ జరుగుతున్నాయి. రాబోయే 6 నుండి 12 నెలల్లో భారతదేశంలో ఆల్‌ఎలక్ట్రిక్ 'ఇక్యాంటర్' యొక్క ప్రారంభం మా పూర్తి ప్రోడక్ట్ పోర్ట్‌ఫోలియోను డీకార్బనైజ్ చేయడానికి మా దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా మొదటి అడుగు. అయితే, డీజిల్ ఐసిఇ మరియు సీఓ 2న్యూట్రల్ ప్రొపల్షన్ టెక్నాలజీలు భారత మార్కెట్‌లో రాబోయే కాలంలో సహా ఉనికిలో కొనసాగుతాయి. రాబోయే రెండు దశాబ్దాలలో మేము డీకార్బనైజ్డ్ రవాణా పరిష్కారాలతో దృఢమైన స్థావరాన్ని కలిగి ఉంటాము మరియు భారతదేశంలో స్థిరమైన రవాణాలో అగ్రగామిగా ఎదగడానికి పురోగతిని సాధిస్తామని అన్నారు.



# 650మంది ఖైదీలకు స్మార్ట్ కార్డులు అందజేత

## కుటుంబ సభ్యులతో ఉచితంగా మాట్లాడుకోవచ్చు

**ముందడుగు మహారాష్ట్ర:**

జైలులో ఉన్న ఖైదీలు కుటుంబసభ్యులతో టచ్‌లో ఉండేందుకు స్మార్ట్ కార్డులు అందజేశారు. దీని ద్వారా వారంలో మూడుసార్లు కుటుంబ సభ్యులు, లాయర్లతో ఉచితంగా మాట్లాడుకోవచ్చు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో ఈ సంఘటన జరిగింది. హర్సుల్ సెంట్రల్ జైలులోని సుమారు 650 మంది ఖైదీలకు స్మార్ట్ కార్డులను జైలు అధికారులు అందజేశారు. ఈ కార్డుల ద్వారా వారంలో మూడుసార్లు ఆరు నిమిషాల చొప్పున కుటుంబ సభ్యులు లేదా న్యాయవాదులతో ఉచితంగా మాట్లాడుకోవచ్చని తెలిపారు. ఆర్థిక పరిస్థితుల వల్ల ఖైదీలను కలుకునేందుకు చాలా మంది కుటుంబ సభ్యులు జైలుకు రాలేకపోతున్నారని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులతో పాటు న్యాయవాదులతో మాట్లాడుకునేందుకు 650 మంది ఖైదీలకు స్మార్ట్ కార్డులు అందించినట్లు చెప్పారు. ఖైదీలతో పాటు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న వారి కోసం జైలు ఆవరణలో కాలింగ్ బూత్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. అయితే ముందుగా అందజేసిన ఫోన్ నంబర్లకు మాత్రమే ఖైదీలు కాల్ చేసే అవకాశం ఉందా? లేక ఏ ఫోన్ నంబర్‌కైనా కాల్ చేసుకోవచ్చా? అన్నది జైలు అధికారులు స్పష్టం చేయలేదు.



# రామస్వామి గుట్టలో శ్రీరాముడి వేడుకలు

## స్వయంభు రామచంద్ర మూర్తికి ప్రత్యేక పూజలు

**ముందడుగు ములుగు:**

ములుగు మండలం ఇంచర్ల శివారులోని రామస్వామి గుట్టలో శ్రీరామచంద్రమూర్తి స్వయంభూగా వెలిశారు. పురోహితులు ముడుంబ రఘునందాచార్యులు ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీరామ నవమి వేడుకలు అంగరంగవైభవంగా నిర్వహించారు. గుట్టలో స్వయంభూగా శ్రీరామచంద్రమూర్తి, అల్వార్లు వెలియడంతో ఇక్కడ పూజలు నిత్యకృత్యమయ్యాయి. ములుగు మండలంలోని చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో హాజరయ్యారు. గుట్ట కింద ఆంజనేయ స్వామి గుడి వెలియడంతో భక్తులు దర్శనానికి బారులు తీరారు.



# పాకిస్థాన్‌లో నిలిపివేసిన 'ఎక్స్' (ట్విట్టర్)

## భద్రతా కారణాల దృష్ట్యా అని వెల్లడి


**ముందడుగు పాకిస్థాన్:**

పాకిస్థాన్‌లో భద్రతా కారణాల దృష్ట్యా సామాజిక మాధ్యమ సంస్థ 'ఎక్స్'ను తాత్కాలికంగా నిలిపివేసినట్లు తాజాగా పాకిస్థాన్ ప్రభుత్వం వెల్లడించింది. ఎన్నికల సమయంలో ఫిబ్రవరిలో ఈ ఆంక్షలు మొదలయ్యాయి. ఆ విషయాన్ని ఇప్పుడు ధ్రువీకరించింది. ఎక్స్ ఖాతాల వినియోగంలో సమస్యలు ఎదురవుతున్నాయని యూజర్లు మొత్తుకున్నా ఇంతకాలం ఆ దేశ అంతర్గత మంత్రిత్వ శాఖ స్పందించలేదు. అయితే బుధవారం పాకిస్థాన్ హైకోర్టుకు సమర్పించిన పత్రాల్లో ఈ విషయాన్ని అంగీకరించింది. దాంతో కోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. వారంలోగా ఆ ఆంక్షలను వెనక్కి తీసుకోవాలని స్పష్టం చేసింది.

# ఉద్యోగం చేసే చోట సిఐ అవమానించాడు

- కసితో సివిల్స్ సాధించిన కానిస్టేబుల్
- 780వ ర్యాంక్ తో అఖిల భారత సర్వీసుకు

**ముందడుగు ఆంధ్రప్రదేశ్:**



ఏపీకి చెందిన ఉదయ్ కృష్ణారెడ్డి అనే యువకుడు సివిల్స్ ఫలితాల్లో 780వ ర్యాంక్ సాధించి అఖిల భారత సర్వీసు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. కానీ అతడి ఈ విజయం వెనుక ఉన్న పట్టుదల ఎలాంటిది అన్న విషయం తాజాగా వెల్లడైంది. దీంతో అంతా అతడిని ప్రశంసిస్తున్నారు.

2013 నుంచి 2018 వరకూ ఏపీలోని ప్రకాశం జిల్లాలో ఉదయ్ కృష్ణారెడ్డి కానిస్టేబుల్ గా పనిచేసాడు. ఆ సమయంలో తన ఉన్నతాధికారి (సీఐ) చేతిలో కృష్ణారెడ్డికి ఓ రోజు తీరని అవమానం జరిగింది. దీంతో ఆయన కానిస్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా చేసేశాడు. అంతే కాదు ఎలాగైనా సివిల్స్ లో ర్యాంక్ సాధించి ఐఏఎస్ అధికారి కావాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఇందుకోసం రాత్రీ పగలూ శ్రమించాడు. సివిల్స్ కోసం కోచింగ్ తీసుకున్నాడు. చివరికి అనుకున్నది సాధించాడు.

గతంలో సీఐ తనను 60 మంది పోలీసుల ముందు అవమానించాడని, అదే రోజు ఉద్యోగానికి రాజీనామా చేసి సివిల్స్ కు ప్రిపేర్ కావడం మొదలు పెట్టానని కృష్ణారెడ్డి యూపీఎస్సీ ఫలితాల ప్రకటన అనంతరం తెలిపాడు. వ్యక్తిగత ద్వేషం కారణంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తనను 60 మంది పోలీసుల ముందు అవమానించాడని, అప్పుడే యూపీఎస్సీ పరీక్ష రాసి ఐఏఎస్ కావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కానీ ప్రస్తుతం తాను సాధించిన 780వ ర్యాంకుతో ఇండియన్ రెవెన్యూ సర్వీసు ఉద్యోగం మాత్రమే వచ్చే అవకాశం ఉంది. దీంతో మరోసారి సివిల్స్ రాసి ఎలాగైనా ఐఏఎస్ సాధిస్తానని కృష్ణారెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఐఏఎస్ సాధించే వరకూ ఎన్ని ప్రయత్నాలైనా చేస్తానని చెప్తున్నాడు.

ముందడుగు
గురువారం 18-4-2024 హైదరాబాద్







# టెక్నోస్మానియా సన్నాహక కార్యక్రమంగా 3కె రన్

## అబ్బుర పరిచిన బైక్ స్టంట్స్, నృత్యాలతో అలరించిన ఫ్లాష్ మాబ్

**ముందడుగు:**

ఉస్మానియా యూనివర్సిటీ లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో ఏప్రిల్ 18, 19, 20 వ తేదీల్లో మూడు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్ టెక్నోస్మానియ2024 సందర్భంగా బుధవారం ఓయూ ఎన్సీసి గేట్ నుండి టెక్నాలజీ కాలేజ్ వరకు "ప్రతి నీటి చుక్కను పొదుపు గా వినియోగించుకుందాం " ... ప్రొటెక్ట్ ఎర్త్స్ ప్రిషియస్ వాటర్ అనే నినాదం తో 3K రన్ ను నిర్వహించారు. రన్నింగ్ లో గెలుపొందిన విజేతలకు నగదు బహుతులతో పాటు సర్టిఫికెట్లు ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రో. చింత సాయిలు మరియు కన్వీనర్ ప్రో. ఎస్.శ్రీను నాయక్ అందజేశారు.విద్యార్థులు ప్రస్తుతం కొన్ని రాష్ట్రల్లో హైదరాబాద్ కూడా కొన్ని ప్రాంతాల్లో నీటి ని ఎద్దడి ఎలా ఉందో వివరించారు. నీటి వృధా చేయకుండా అవసరానికి అవసరం అయిన మేరకే వినియోగించుకోవాలన్నారు.

### అబ్బుర పరిచేలా బైక్ స్టంట్స్

టెక్నాలజీ కళాశాల ఆవరణలో ప్రొపెషనల్ బైక్ స్టంట్స్ స్టంటర్స్ తో బైక్ స్టంట్స్ నిర్వహించారు. ఈ బైక్ స్టంట్స్ పూర్తిగా స్థాయి ఆద్యంతం అలరించి,స్టంట్స్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఓయూ రేణుక ఎల్లమ్మ టెంపుల్ వద్ద "ఫ్లాష్ మాబ్ " నిర్వహించారు.
ఫ్లాష్ మాబ్ లో విద్యార్థిని విద్యార్థుల నృత్యాలు ప్రేక్షకులను బాటసారులను విశేష స్పందన లభించింది.ఇక రంగోలి,పెయింటింగ్ మరియు మెహందీ పోటీలు నిర్వహించారు. వీటిలో విద్యార్థినిలు పోటా పోటీగా పాల్గొని తమ సృజనాత్మక ఆలోచనలు ప్రాణం పోశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీనియర్ ప్రో. చింత సాయిలు, కన్వీనర్ ప్రో. ఎస్.శ్రీను నాయక్,వైస్ ప్రిన్సిపాల్ ప్రో. వి.రమేష్ కుమార్,ప్రో. వి.వి.బసవరావు,ప్రో. బి. రాజం ,ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్స్ డా. ఏ. పరశురాములు, డా. బి. పరమేశ్వర్లు, డా. సాదం ఐలయ్య, డా. వి. భాస్కర్, డా. కె. శ్రీనివాసులు, డా.టి.వెంకటేశ్వర్లు, డా.సునిత పల్లేటి , డా.బి.నారాయణ, డా.ధీరజ్, డా.అర్జున్, డా.టి.అజిత్, డా.అభిలాష్, డా.ఎ.విజయ్ కాంత్, డా.రవీందర్, గోపి,స్టూడెంట్ కో ఆర్డినేటర్ లు శ్యామ్ సుందర్, మాధవి, ఆకాష్, పి.అఖిల,ముకేష్, జె. సాహిత్య,ఎం.సూరి దుర్గ, ఎం. అరవింద్, కళాశాల అధ్యాపకులు ,విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# పరకాల, నడికూడలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

**ముందడుగు పరకాల**

రానున్న లోక్ సభ సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని శాంతి భద్రతల పరిరక్షణ కోసం వరంగల్ పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ జా ఆదేశాల మేరకు పరకాల పోలీసు మరియు భీమారం సీఆర్పీఎఫ్ బెటాలియన్ సంయుక్తంగా పరకాల, నడికూడలలో ప్రధాన రహదారిపై ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లందరూ నిర్భయంగా, శాంతి యుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు. ఈ కార్యక్రమంలో పరకాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రవిరాజా, సబ్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, పరకాల పోలీసు సిబ్బంది, సీఆర్పీఎఫ్ బెటాలియన్ జవానులు పాల్గొన్నారు.


# 12 రాష్ట్రాల్లో ఒక్క సీటు కూడా గెలవలేని స్థితిలో హస్తం పార్టీ


- కూటమిలో ఉన్నవాళ్లూ పట్టించుకోవట్లే
- రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

**ముందడుగు:**



కాంగ్రెస్ ముక్త్ భారత్ త్వరలో సాధ్యం కానుందని, ప్రజలు బీజేపీని ఆదరించేందుకు సిద్ధమయ్యారని, ఏ సర్వే చూసినా అన్నీ బీజేపీ వైపే అనుకూలంగా ఉన్నాయని రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాద్రి సీతారాముల కల్యాణానికి లైవ్ టెలికాస్ట్ ఇవ్వకుండా రేవంత్ రెడ్డి సర్కార్ ప్రయత్నించిందని, ఎన్నికల కోడ్ సాకుతో ఆపాలని చూసిందని ఆయన విమర్శలు చేశారు. దీన్ని కూడా రాజకీయ కోణంగా చూశారన్నారు. కానీ చివరకు లైవ్ టెలికాస్ట్ కు ఈసీ అనుమతి ఇచ్చిందన్నారు. దీన్ని ప్రజలు, రామ భక్తుల విజయంగా లక్ష్మణ్ చెప్పుకొచ్చారు. ఇకపోతే దాదాపు 12 రాష్ట్రాల్లో కాంగ్రెస్ కు ఒక్క సీటు కూడా గెలవలేని పరిస్థితిలో ఉందని ఆయన పేర్కొన్నారు. కూటమిలో ఉన్న పార్టీలు సైతం కాంగ్రెస్ ను ఆదరించడం లేదని, గౌరవించడం లేదన్నారు. పంజాబ్, వెస్ట్ బెంగాల్, తమిళనాడులో కూడా ఎవరూ పట్టించుకోవడం లేదని వెల్లడించారు. కాంగ్రెస్ 40 సీట్లు కూడా గెలిచే పరిస్థితి లేదని మమతా బెనర్జీ ప్రకటించిందని, తెలంగాణలో నేల విడిచి సాము చేసినట్లు కాంగ్రెస్ తీరు ఉందని లక్ష్మణ్ విమర్శలు చేశారు. అలాంటిది ఇక్కడి నేతలు రాహుల్ గాంధీ ప్రధాని అంటూ కబుర్లు చెబుతున్నారని ఫైరయ్యారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేక కాంగ్రెస్ నేతలు సతమతమవుతున్నారని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి కూడా అయోమయ పరిస్థితిలో పడ్డారని, ఆ పార్టీలో నేతల మధ్య సరిగ్గా పొసగడం లేదని, దీంతో రేవంత్ రెడ్డి అభద్రతా భావంలో పడ్డాడన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికలతో బీఆర్ఎస్ పూర్తిగా కనుమరుగు కానుందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నాయని, ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకున్నట్లు నటిస్తున్నారని లక్ష్మణ్ విమర్శలు చేశారు. కవితను జైలు నుంచి విడిపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.





# నల్గొండలో ఘోర రోడ్డు ప్రమాదం

- సినీ నటుడు రఘుబాబు కారు ఢీకొని వ్యక్తి మృతి
- మృతుడు బీఆర్ఎస్ టౌన్ ప్రధాన కార్యదర్శిగా గుర్తింపు

**ముందడుగు:**

నల్గొండ బైపాస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సినీ నటుడు రఘుబాబు కారు బైక్ ను ఢీ కొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నల్గొండ నల్లగొండ పట్టణ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సందినేని జనార్ధన్‌రావుగా పోలీసులు గుర్తించారు. నటుడు రఘుబాబు కారు బైకును దాదాపు 50 మీటర్ల దూరం లాక్కెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసిన నల్గొండ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు హైదరాబాద్‌లోని శ్రీనగర్ కాలనీకి చెందిన సందినేని జనార్ధన్ రావు (51) బీఆర్ఎస్ టౌన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. ఆయన కొంతమందితో కలిసి పట్టణ పరిధిలోని రిక్షా పుల్లర్స్ కాలనీ వద్ద దత్త సాయి వెంచర్ ఏర్పాటు చేశారు. ప్రతిరోజు మధ్యాహ్నం సమయంలో వెంచర్ వద్దకు వెళ్లి వస్తుండేవాడు. ఈ క్రమంలోనే బుధవారం మధ్యాహ్నం సమయంలో వెంచర్ వద్దకు వెళ్లి సాయంత్రం తిరిగి వస్తుండగా హైదరాబాదు నుండి మిర్యాలగూడ వైపు వెళ్తున్న KA03MP6914 నెంబర్ గల BMW కారు జనార్ధన్ రావు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో జనార్ధన్ రావుకు తీవ్ర గాయాలు స్పాట్‌లోనే మృతి చెందాడు. మృతుని భార్య నాగమణి కంప్లైంట్ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జనార్ధన్ రావు స్వస్థలం నకిరేకల్ మండలంలోని మంగళపల్లి గ్రామంగా తెలిసింది. జనార్ధన్ రావుకు భార్య నాగమణి, కుమార్తె, తనయుడు ఉన్నారు.